

హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు

3,850 క్యూసెక్కులు సాధ్యమేనా..?

హంద్రీ నీవా ద్వారా 3,850 క్యూసెక్కుల నీరు తీసుకోవాలి.. కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణా జలాలు మళ్లించాలి..! ఇది కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతిష్టాత్మకంగా రూ.2,640 కోట్లతో విస్తరణ పనులు చేపట్టారు. మట్టి పనులు 90 శాతానికి పైగా పూర్తి చేశారు. అయితే సీసీ లైనింగ్, షాట్ క్రెటింగ్ పనులు 40 శాతం కూడా పూర్తవ్వలేదు. రోడ్డు క్రాసింగ్ బ్రిడ్జిలు, స్ట్రక్చర్ల వద్ద లైనింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 17న సీఎం చంద్రబాబు హంద్రీ నీవాకు కృష్ణా జలాల ఎత్తిపోతను ప్రారంభించనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిస్థాయిలో నీరు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. అది సాధ్యమేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- రూ.1,970 కోట్లతో హంద్రీ నీవా విస్తరణ పనులు
- మట్టి పనులు 90 శాతానికి పైగా పూర్తి
- అసంపూర్తిగా లైనింగ్ పనులు
- 17న కృష్ణా జలాలు ఎత్తిపోతను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

కర్నూలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు కృష్ణాజలాలు ఎత్తిపోసి రాయలసీమ జిల్లాల్లో 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. 1989లో ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) హయాంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తే.. 2004-05 నుంచి పనులు వేగంగా జరిగాయి. 8 ఏళ్లకు ఉమ్మడి కర్నూలు జిల్లా మాల్యాల లిఫ్ట్ నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు ఫేజ్-1 కింద చేపట్టిన 0/00 నుంచి 216.30 కిలో మీటర్ల వరకు ప్రధాన కాలువ, ఎత్తిపోతల పథకాలు పూర్తి చేసి 2012 నవంబరులో ట్రయల్ రన్ విజయవంతం చేశారు. అయితే.. పదేళ్లుగా 2 వేల క్యూసెక్కులకు మించి నీరు తీసుకోలేని పరిస్థితి ఉంది. 2017-18లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం 3,850 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి వీలుగా రూ.1,030 కోట్లతో కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విస్తరణ అటకెక్కింది. ఐదేళ్లలో గంపెడు మట్టి కూడా తీయకపోగా, రూ.6,500 కోట్లలో 6 వేల క్యూసెక్కులకు విస్తరిస్తామంటూ మాయ మాటలతో మభ్యపెట్టారే తప్ప ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరి కూటమి ప్రభుత్వం వచ్చి ఇంత కాలమైనా ప్రధానమైన పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 3,850 క్యూసెక్కులు సాధ్యమేనా..! అనే ప్రశ్న కూడా ఉంది. అయితే పనులను వేగవంతం చేయాలనే లక్ష్యం ప్రభుత్వానికి ఉన్నట్లు తెలుస్తోంది.



హంద్రీనీవా విస్తరణ పనులు

ప్రతిష్టాత్మకంగా విస్తరణ పనులు

హంద్రీనీవా కాలువ ద్వారా పూర్తిస్థాయి ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కృష్ణా జలాలు ఎత్తిపోసి కుప్పం బ్రాంచి కెనాల్‌కు మళ్లించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విస్తరణకు శ్రీకారం చుట్టింది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల ప్రధాన ఎత్తిపోతల పథకం నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వరకు ప్రధాన కాలువ విస్తరణ బ్యాలెన్స్ పనులు ఫేజ్-1 కింద రూ.695 కోట్లతో చేపట్టారు. ప్యాకేజీ-1 కింద మాల్యాల ఎత్తిపోతల పథకం (పీహెచ్-1) అప్రోచ్ చానల్ సహా 0/0 నుంచి 88 కిలో మీటర్లు వరకు మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. ప్యాకేజీ-2 కింద 88 నుంచి 216.30 కి.మీల వరకు వీపీఆర్-డీఎస్ఆర్ జాయింట్ వెంచర్ కింద చేపట్టారు. ఫేజ్-2లో భాగంగా 216.300 కి.మీటర్ల నుంచి 340.500 కిలో మీటర్ల వరకు ప్యాకేజీ-1,2,3 కింద రూ.456.54 కోట్లతో విశాఖకు చెందిన ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - ఎల్‌సీసీ జాయింట్ వెంచర్, 340 కి.మీల నుంచి 400.500 కి.మీల వరకు ప్యాకేజీ-4,5 కింద రూ. 352.40 కోట్లతో కర్ణాటకకు చెందిన బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు చేపట్టింది. పుంగనూరు బ్రాంచి కెనాల్ 0/00 కి.మీల నుంచి 75.050 కిలో మీటర్ల వరకు లైనింగ్ పనులు ప్యాకేజీ-6,7 కింద రూ.266.23 కోట్లతో ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రాటెక్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టింది. అలాగే.. కుప్పం బ్రాంచి కెనాల్ లైనింగ్ పనులు రూ.200 కోట్లతో చేపట్టారు. అంటే.. అగ్రిమెంట్ విలువ ప్రకారం రూ.1,970 కోట్లతో నంద్యాల జిల్లా మాల్యాల నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు హంద్రీ నీవా విస్తరణలో భాగంగా మట్టి, సీసీ లైనింగ్, షాట్ క్రెటింగ్ పనులు చేపట్టారు.

పూర్తికాని సీసీ లైనింగ్

హంద్రీ నీవా 0/0 నుంచి 400.500 కిలో మీటర్లు వరకు ప్రధాన కాలువ, 0/0 నుంచి 75.050 కిలో మీటర్లు పుంగనూరు బ్రాంచి కెనాల్ విస్తరణ, సీసీ లైనింగ్ పనులు రూ.1,770.70 కోట్లతో చేపట్టారు. మట్టి పనులు 1.89 కోట్లు క్యూబిక్ మీటర్లు మట్టి పనులకు గాను 1.68 - 1.70 కోట్లు క్యూబిక్ మీటర్లు (90 శాతం), సీసీ లైనింగ్, షాట్ క్రెటింగ్ పనులు 80.61 లక్షల స్క్వేయర్ మీటర్లకు గాను 30-32 లక్షల స్క్వేయర్ మీటర్లు (40 శాతం) పూర్తి చేసినట్లు ఇంజనీర్లు పేర్కొన్నారు.



రోడ్డు క్రాసింగ్ వంతెనల వద్ద లైనింగ్ చేయని దృశ్యం

మిగతా 4వ పేజీలో

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు నామినేషన్స్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు నామినేషన్స్ సెప్టెంబరు 15వ తేదీలోపు పంపించాలని డీఈవో జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు నామినేషన్స్ పంపవచ్చన్నారు. ఇన్‌స్పైర్ మనక్ కింద రిజిస్టర్ అయిన ఒక్కో పాఠశాల నుంచి ఐదు నుంచి ఏడు నామినేషన్స్ పంపించాలని తెలిపారు.

నేడు గ్రామీణ వైద్యుల సదస్సు

కర్నూలు హాస్పిటల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల సదస్సును బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని ఓమిని హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీడీ జనార్ధన్ హాజరు అవుతారన్నారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ పక్కన ఉన్న శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో ఈ సదస్సు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని అన్నారు. మూడు వేల మంది దాకా హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాల కారణంగా అంటువ్యాధులు ఎక్కువగా వ్యాప్తిచెందుతున్నాయని, సూపర్‌వైజర్లు అప్రమత్తంగా ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్. వెంకటరమణ అన్నారు. మంగళవారం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలన్నీ సక్రమంగా నిర్వహించాలని అవసరమైతే జిల్లా కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. డీపీవో నజీని మాట్లాడుతూ గర్భిణులను నమోదు చేయడంలో జిల్లా వెనకబడి ఉందని, తక్కువ శాతం నమోదుచేసిన వారికి త్వరలో మెమో జారీ చేస్తామన్నారు. జిల్లా గణాంక అధికారి సుజాత మాట్లాడుతూ హెచ్ఎంఐఎస్, సీఎస్ఎస్ఎం, సీఆర్ఎస్, సీడీ-ఎన్‌సీడీ, రిపోర్ట్స్, స్వర్ణాంధ్ర-2047 కేపీఐ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ ఎలాంటి తప్పుల్లేకుండా ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు అన్ని పోర్టల్స్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాంతారావు నాయక్, టీబీ, లెప్రసీ జిల్లా అధికారి డా. శారదాబాయి, సంచార చికిత్స ప్రోగ్రాం అధికారి డా.కె.జగదీష్‌చంద్రారెడ్డి, పీఎంకేవై అధికారి డా. రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమయం వృథా కాదు

జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి అమ్మన్న రాజా

నంద్యాల క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ప్రక్రియ ద్వారా సమయం వృథా కాదని మండల లీగల్‌సెల్ చైర్మన్, నంద్యాల మూడో అదనపు జిల్లా న్యాయాధికారి అమ్మన్నరాజా అన్నారు. మంగళవారం కోర్టు భవనంలో నిర్వహించిన మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా పాత్రికేయులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్ కాంపౌండ్, క్రిమినల్ కేసులు, రాజీపడదగ్గ ఇతర కేసులకు మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన సీనియర్ న్యాయవాదులు రామచంద్రరావు, సాయిస్వరూప్ మధ్యవర్తిత్వంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెటిల్‌మెంట్ అయిన తర్వాత ఆయా కోర్టుల న్యాయాధికారుల ఆధ్వర్యంలో అవార్డు ఇస్తామని తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ద్వారకానాథ్, నరసింహులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 1కే వాక్

మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వన్ నేషన్-మీడియేషన్ కార్యక్రమంపై 1కే వాక్ నిర్వహిస్తున్నట్లు మీడియేషన్ ప్రతినిధులు వెదుర్ల రామచంద్రరావు, సాయిస్వరూప్ తెలిపారు. ఈకార్యక్రమంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, ఎన్జీవోస్, స్టేట్‌హోల్డర్స్, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

గంగ పారని కాల్వలు

- కూలిపోయిన టీజీ ప్రధాన కాల్వ సైడ్ వాల్
- తుప్పుబట్టిన బ్లాక్ చానెల్ తూము షట్టర్లు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- 26, 27 బ్లాక్‌చానెళ్ల పనులు ప్రారంభం కాని వైనం

5

రూ. 37.9 లక్షలు స్వాధీనం

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, మాండ్ర

హెలిప్యాడ్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, మాండ్ర



అల్లూరులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నందికొట్కూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మంగళవారం పరిశీలించారు. అల్లూరు గ్రామంలో గల హెలిప్యాడ్‌ను పరిశీలించాక, మల్యాల ఎత్తిపోతల పథకాన్ని కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపి ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సందర్శించారు. హంద్రీ నీవా కాలువలో జరుగుతున్న లైనింగ్ పనులను కూడా వారు పరిశీలించారు. ఈ నెల 17న సీఎం చంద్రబాబు నాయుడు మల్యాల ఎత్తిపోతల నుంచి నీరు విడుదల చేసి జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. హంద్రీ నీవా కాలువలో ఫేస్ 1, ఫేస్-2 కింద 554 కిలో మీటర్ల మేర జరుగుతున్న కాలువ లైనింగ్, వెడల్పు పనులను పరిశీలిస్తారు.

ఘనంగా జయతీర్థుల ఆరాధనోత్సవాలు

- బంగారు రథంపై ఊరేగించి ప్రత్యేక పూజలు

మంత్రాలయం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పూర్వపు గురువులు జయతీర్థుల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీమఠంలో జయతీర్థుల బృందావన చిత్రపటానికి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య బృందావన చిత్రపటానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి చిత్రపటాన్ని బంగారు రథంపై అధిష్టించి సుబుధేంద్ర తీర్థులు మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఊంజల మంటపంలో వెండి ఊయలలో స్వామివారిని ఉంచి పూజలు చేశారు. పీఠాధిపతి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పండితులచే జయతీర్థుల విజయ గాథలపై ప్రవచనాలు చేశారు. పూర్ణబోధ పూజా మందిరంలో సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు విశేషంగా బంగారు ఆభరణా లతో అభిషేకం చేశారు. ఈపూజలను కన్నులారా తిలకించిన భక్తులు మంత్రముగ్ధులయ్యారు. వేలాది మంది పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, పవన్ ఆచార్, విజయేంద్రాచార్, ఆనందతీర్థ ఆచార్, గౌతమ్ ఆచార్, గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బంగారు రథానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉప లోకాయుక్త ఆగ్రహం

వేర్వేరు కేసుల్లో సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌కు ఇంక్రిమెంట్లు నిలుపుదల

కర్నూలు లీగల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిషేధిత ఆస్తుల రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు పాల్పడిన అనంతపురం జిల్లా గుత్తి సబ్ రిజిస్ట్రార్ ఎస్.మహబూబ్ అలీపై రాష్ట్ర ఉప లోకాయుక్త చర్యలు తీసుకుంది. గతంలో ఆయన కర్నూలు జిల్లా కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ యూడీసీగా పని చేశారు. ఆ సమయంలో అక్రమంగా నిషేధిత ఆస్తుల రిజిస్టర్లను పరిశీలించకుండా ఆస్తులకు తక్కువగా వెలకట్టి ప్రభుత్వానికి నష్టం చేకూరేలా వ్యవహరించారని కర్నూలు బంగారుపేటలోని రాక్‌వుడ్ మెమోరియల్ హైస్కూలుకు చెందిన బీపీ జాన్ ఫిర్యాదు దాఖలు చేశారు. దీంతో రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ఆదేశాల మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ విచారించి అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని తన నివేదికలో పేర్కొన్నారు. ఆ తర్వాత అనంతపురం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రభుత్వ నిబంధనల మేరకు సబ్ రిజిస్ట్రార్‌పై మేజర్ పెనాల్టీగా 5 ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరో కేసులో బి.తాండ్రపాడు గ్రామ సర్వే నెం. 16/2ఎ1లోని ప్రభుత్వ భూమినికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కర్నూలు సీనియర్ అసిస్టెంట్ ఎం. హజ్మీజాకు రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కేసులో ఫిర్యాది మురళీధర్ రెడ్డి ఉప లోకాయుక్త తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేయడంతో ఫిర్యాదు ముగిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ఆదేశాలు జారీ చేశారు.



రుద్రవరం మండలం ఆలమూరులో సాగు చేసిన అరటి

బీమాతో ధీమా

- పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- బీమా నమోదుకు నెలాఖరు దాకా అవకాశం.. కొన్ని పంటలకు ఆగస్టు 15 వరకు..
- ఆనందంలో అన్నదాతలు

నంద్యాల ఎడ్యుకేషన్/రుద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోకుండా రైతులకు పంటల బీమా కొంత ఊరటనిస్తుంది. ఊహించని విపత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పంటనష్టానికి గురైన రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రక్షణ కవచమనే చెప్పవచ్చు. జిల్లాలో పీఎంఎఫ్‌బీవై పథకం కింద 10 పంటలు ఎంపికయ్యాయి. వరి, మొక్కజొన్న, కంది, మినుము, మిరప, జొన్న, సజ్జలు, కొర్ర, ఆముదం ఉల్లి పంటలకు బీమా సౌకర్యం కల్పించారు. వరి పంటకు మినహా ఇతర పంటలకు బీమా చేయించడానికి ఈనెల 31 వరకు అవకాశం ఉంది. వరితో పాటు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద జిల్లాలో పత్తి, వేరుశనగ, నిమ్మ, అరటి పంటలకు బీమాకు నమోదు చేసుకోవడానికి ఆగస్టు 15వరకు అవకాశం ఉంది. వరికి గ్రామాన్ని యూనిట్‌గా, అరటి, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మినుము, మిరప పంటలకు మండలాన్ని యూనిట్‌గా, జొన్న, సజ్జలు, కొర్రలు, ఆముదం, ఉల్లి పంటలను జిల్లా యూనిట్‌గా తీసుకున్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం వివరాలివి..



వరి పంటకు రైతు హెక్టారుకు రూ.2వేలు ప్రీమియం చెల్లిస్తే రూ.లక్ష బీమా వర్తిస్తుంది. మొక్కజొన్నకు రూ.1650 చెల్లిస్తే రూ.82,500, కంది పంటకు రూ.1000 చెల్లిస్తే రూ.50వేలు, మినుము పంటకు రూ.475లు చెల్లిస్తే రూ.47,500 బీమా వర్తిస్తుంది. అలాగే మిరపకు హెక్టార్‌కు రూ.7200 చెల్లిస్తే రూ.2,25,000, జొన్నకు రూ.475 చెల్లిస్తే రూ.47,500, సజ్జ, కొర్ర, ఆముదం పంటలకు రూ.400లు చెల్లిస్తే రూ.40వేలు బీమా వర్తిస్తుంది. ఉల్లి పంటకు హెక్టార్‌కు రూ.1125 చెల్లిస్తే రూ.1,12,500, అరటికి రూ.6875 చెల్లిస్తే రూ.1,37,500, పత్తికి రూ.4వేలు చెల్లిస్తే రూ.లక్ష, వేరుశనగకు రూ.1400 చెల్లిస్తే రూ.70వేలు బీమా వర్తిస్తుంది.

కావాల్సిన పత్రాలు

రైతులు బీమా ప్రీమియంను స్థానిక రైతు సేవా కేంద్రాల్లో చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అధీకృత కంపెనీగా వ్యవహరిస్తుండగా, వాతావరణ ఆధారిత బీమా పథకానికి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అధీకృత కంపెనీగా వ్యవహరిస్తోంది. రైతులు వారి ఆధార్ కార్డు, సొంత భూములు కల్గిన రైతులు అయితే పొలం పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, స్థానిక వ్యవసాయ సహాయకులు ఇచ్చిన పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకెళ్లి బీమా కోసం నమోదు చేయించుకోవాలి. కౌలుదారులు వాటితో పాటు వారికి ప్రభుత్వం అందజేస్తున్న కౌలుకార్డును తీసుకెళ్లి బీమా చేయించుకోవాలి.



రుద్రవరంలో సాగు చేసిన వేరుశనగ

నాలుగు ఎకరాల్లో అరటి సాగుచేశా



నాలుగు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశా. ప్రభుత్వం బీమా వర్తింపజేయడం సంతోషంగా ఉంది. గతంలో బీమా లేక నష్టపోయాం. ఈ సారి బీమా వర్తించడంతో ధైర్యంగా పంట సాగుకు ముందడుగు వేశా.

- దస్తగిరి, ఆలమూరు, రుద్రవరం మండలం

బీమా చేయించుకోవాలి



పంట వేసిన ప్రతి రైతు తప్పకుండా ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. అధిక వర్షాలతో కాని, విపత్తులతో కాని పంటలు నష్టపోయినప్పుడు బీమా రైతుకు ఎంతో అండగా నిలుస్తుంది. ప్రతి రైతు సేవాకేంద్రంలోనూ, పొలం పిలుస్తోంది కార్యక్రమంలోనూ బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

వైసీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- పులివెందులలో సైతం జగన్‌కు ఓటమి ఖాయం
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేర్నినాని లాంటి నాయకులు చంద్రబాబును అప్రతిష్ట పాలు చేయాలని ఎన్నికుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మేమే అధికారంలోకి వస్తామంటూ ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారని, వారు అధికారంలోకి రావడం ఓ కల మాత్రమేనని, పులివెందులలో సైతం జగన్ ఓటమి ఖాయమన్నారు వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి జగన్మోహన్‌రెడ్డి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేక పోయారని ఆరోపించారు. టీడీపీ హయాంలో వచ్చిన పరిశ్రమలను సైతం రాష్ట్రం నుంచి తరిమేశారన్నారు. కోడాలి నాని, వల్లభ నేని వంశీలకు ఏగతి పట్టిందో.. నీకు కూడా అదే గతి పడుతుందని పేర్ని నానిని హెచ్చరించారు. అవాక్కులు.. చెవాక్కులు పేలడం మానుకోవాలని హితవు పలికారు.

మల్లన్న సన్నిధిలో మాజీ సీఈసీ రాజీవ్‌కుమార్

నంద్యాల కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి, అమ్మవార్ల దర్శనం కోసం మంగళవారం మాజీ సీఈసీ రాజీవ్‌కుమార్ శ్రీశైలం వచ్చారు. ఆయన స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.



మాజీ సీఈసీ రాజీవ్‌కుమార్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

ప్రమాదాల పడవ ప్రయాణం



మరబోటులో ప్రయాణం చేస్తున్న ప్రజలు

- నిషేధించినా నదిలో మరబోట్లు తిప్పుతున్న నిర్వాహకులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కొత్తపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పడవ ప్రయాణం ప్రమాదమని తెలిసినా.. ఆంధ్ర, తెలంగాణవాసులకు తప్పడం లేదు. ప్రభుత్వం మరబోట్లను నిషేధించినప్పటికీ ఇరు ప్రాంతాల బోట్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా మరబోట్లు తిప్పుతునే ఉన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం నుంచి సోమశిల వరకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో కృష్ణానదిలో వందలాది మంది ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టకుని మరబోట్లలో, పుట్టిల్లో ప్రమాదపు అంచున పడవ ప్రయాణం చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని పాతమాడుగుల, కొత్తపల్లి, సింగరాజుపల్లి, మునలిమడుగు, ఎర్రమఠం, గుమ్మడాపురం, కపిలేశ్వరం, కొక్కెరంచ, లింగాపురం తదితర గ్రామాల ప్రజలకు ఆవలి ప్రాంతమైన తెలంగాణ ప్రాంతంలోని కొల్లాపురం, సోమశిల, మల్లేశ్వరం, సింగోటం, పెంటవల్లి, మంచాలకట్ట, కొప్పునూరు తదితర గ్రామాల్లో బంధుత్వాలు ఉన్నాయి. నదీ ప్రయాణం వీరికి దూరం కలిసి వస్తుంది. ఈ కారణంతో అనుమతి లేని మరబోట్లలో ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. దీన్ని సాకు చేసుకొని సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని లైఫ్ జాకెట్లు లేకుండా హారెత్తే నది మీద మర బోట్ల నిర్వాహకులు అటూ ఇటూ తిప్పుతున్నారు. గతంలో పగిడ్యాల మండలం నెహ్రూనగర్ ప్రాంతం నుంచి 2007 జనవరి 18న సింగోటం జాతరకు పడవ ప్రయాణం చేస్తూ 67 మంది మృతి చెందారు. అలాగే 2015 డిసెంబరులో పుట్టి ప్రయాణం చేస్తూ జానాల గూడేనికి చెందిన ముగ్గురు గిరిజనులు మృత్యువాత పడ్డారు. 2017 శివరాత్రి రోజున కొత్తపల్లి మండలంలోని సింగరాజుపల్లికి చెందిన నిండు గర్భిణీ పుట్టి ప్రయాణంలో మృతి చెందింది. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కలెక్టర్ అనుమతి లేకుండా మరబోట్లు తిప్పితే సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఇరు ప్రాంతాల మరబోట్ల నిర్వాహకులు కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఎన్‌హెచ్-167కే రహదారి నిర్మాణం జరిగితే ఈ ప్రాంతం వారికి ప్రమాదకరమైన పడవ ప్రమాదం తప్పుతుంది. ఇరు రాష్ట్రాలను కలిపే తీగల వంతెన కూడా రూ.1000 కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు చేయించినప్పటికీ ఇంకా కాలయాపన చేస్తున్నారే తప్ప.. పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మర బోట్లను అడ్డుకొని, తక్షణమే సిద్ధేశ్వరం వంతెన నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



సంగమేశ్వరం నుంచి సోమశిల వరకు పడవలో ప్రయాణం చేస్తున్న ప్రజలు

మరబోట్లు తిప్పితే చర్యలు తప్పవు

సంగమేశ్వరం-సోమశిల మధ్య అనుమతి లేకుండా మరబోట్లు తిప్పితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కలెక్టర్ మరబోట్లు తిప్పరాదని ఆదేశాలు జారీ చేశారు. అయినా మర బోట్లు నిర్వాహకులు తిప్పుతున్నారని మా దృష్టికి వచ్చింది. మర బోట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.

- ఉమారాణి, తహసీల్దార్

కృష్ణానదిపై వంతెన నిర్మించాలి



సంగమేశ్వరం, సోమశిల మధ్య ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం తక్షణమే చర్యలు చేపట్టాలి. మరబోట్లలో ప్రయాణం చేస్తూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం మర బోట్లు నిషేధించినప్పటికీ కొందరు పరిమితికి మించి ప్రయాణికులను మరబోట్లలో ఎక్కించుకుని తిప్పుతున్నారు.

- నక్కస్వాములు, సీపీఎం మండల నాయకుడు

3,850 క్యూసెక్కులు సాధ్యమేనా..?



హంద్రీనీవా మెయిన్ కెనాల్ 29 కి.మీ.ల వద్ద ఇదీ పరిస్థితి

3వ పేజీ తరువాయి

ఫేజ్-1 కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో మేజర్‌గా మట్టి పనులు చేస్తే, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో లైనింగ్ పనులు చేపట్టారు. ఫేజ్-1 పరిధిలో 90 శాతం మట్టి పనులు, 17-18 శాతం లైనింగ్ పనులు, ఫేజ్-2లో 87 శాతం మట్టి, 43-45 శాతం సీసీ లైనింగ్ పనులు పూర్తి చేశారు. ముఖ్యంగా సింగిల్ లైన్ రోడ్ బ్రిడ్జి (ఎస్‌ఎల్‌ఆర్‌బీ), అండర్ టన్నెల్ (యుటీ), క్రాస్ మ్యాసరి క్రాస్ డ్రైనేజీ (సీఎంసీడీ).. వంటి నిర్మాణాలు (స్ట్రక్చర్స్) వద్ద రెండు వైపులు సుమారు 50 మీటర్ల వరకు లైనింగ్ తప్పకుండా చేయాల్సి ఉందని ఇంజనీర్లు అంటున్నారు. జరిగిన పనులు పరిశీలిస్తే.. కీలకమైన స్ట్రక్చర్స్ వద్ద 75-80 శాతం లైనింగ్ పనులు చేయలేదు. ఆ ప్రాంతంలో వెలాసిటీ (నీటి ప్రవాహ వేగం) తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వం లక్ష్యం మేరకు 3,850 క్యూసెక్కులు తీసుకోవడం సాధ్యమేనా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలను ఒప్పించేందుకు పూర్తి స్థాయి 3,850 క్యూసెక్కులు ఎత్తిపోస్తే కాలువ గట్లకు ప్రమాదం లేకపోలేదని అంటున్నారు. వివిధ నిర్మాణాల వద్ద సీసీ లైనింగ్ చేస్తే 3 వేల నుంచి 3,500 క్యూసెక్కులు తీసుకునే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. వాస్తవంగా జూన్ ఆఖరిలోగా విస్తరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా కాగా.. వివిధ కారణాల వల్ల ఈ నెల 25 వరకు పొడిగించారు.

17న సీఎం చంద్రబాబు రాక

శ్రీశైలం ఎగువ నుంచి హంద్రీ నీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోసేందుకు ఈ నెల 17 సీఎం చంద్రబాబు రానున్నారు. ఈ మేరకు అధికారులు సీఎం పర్యటన ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీ పర్యటన తరువాత చంద్రబాబు జిల్లాకు రానున్నారు. విస్తరణ ప్రతిష్టాత్మకంగా తీసుకొని దాదాపు మూడు నెలల్లో 90 శాతం మట్టి పనులు పూర్తి చేయడం జలవనరుల శాఖలో ఒక రికార్డని ఇంజనీర్లు పేర్కొన్నారు. పనులు మొదలు పెట్టిన తరువాత సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడమే కాకుండా వారం వారం సమీక్షించి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను పరుగులు పెట్టించారు.

పూర్తిస్థాయిలో నీరు ఎత్తిపోస్తాం

హంద్రీ నీవా కాలువ విస్తరణ పనులు 90 శాతానికిపైగా పూర్తి చేశాం. లైనింగ్ పనులు కొంత చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు సన్నాహాలు పూర్తి చేశాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా లక్ష్యం మేరకు నీటిని లిఫ్ట్ చేస్తాం. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టింది. తక్కువ సమయంలో విస్తరణ పనులు పూర్తి చేయడం ఇంజనీరింగ్ చరిత్రలో ఒక రికార్డు. - పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీ నీవా సర్కిల్-1, కర్నూలు:

ప్యాకేజీల వారిగా పురోగతి (మట్టి పనులు క్యూబిక్ మీటర్లు, లైనింగ్ స్క్వేయర్ మీటర్లు, లక్షల్లో)

ప్యాకేజీలు	మట్టి పనులు			లైనింగ్ పనులు		
	లక్ష్యం	చేసింది	శాతం	లక్ష్యం	చేసింది	శాతం
ఫేజ్-1: అప్రోచ్ ఛానల్, 0/0 నుంచి 216.300 కిలో మీటర్లు						
ప్యాకేజీ-1	37.79	32.90	87.00	5.61	2.10	37.40
ప్యాకేజీ-2	84.97	76.88	90.51	14.13	1.25	8.90
మొత్తం	122.76	109.78	89.42	19.74	3.35	16.97
ఫేజ్-2: 216.300 నుంచి 400.500 కి.మీలు, పుంగనూరు బ్రాంచి కెనాల్ 0/0 - 75.050 కి.మీలు						
ప్యాకేజీ-1	6.87	7.95	115.72	14.08	7.28	51.68
ప్యాకేజీ-2	4.45	4.92	110.60	7.94	4.72	59.44
ప్యాకేజీ-3	6.28	5.97	95.06	9.66	5.65	58.40
ప్యాకేజీ-4	7.28	7.98	109.68	3.87	1.25	32.40
ప్యాకేజీ-5	14.20	10.95	77.10	10.14	2.79	27.50
ప్యాకేజీ-6	9.08	6.26	69.00	4.84	1.49	30.72
ప్యాకేజీ-7	18.18	14.12	77.70	10.34	3.48	33.62
మొత్తం	66.34	58.15	87.65	60.87	26.66	43.79
మొత్తం	189.10	167.93	88.80	80.61	30.01	37.22



పంట రక్షణకు వినూత్న ఆలోచనలు

పొలాల్లో పులిబొమ్మ, ఖాళీ మద్యం సీసాల ఏర్పాటు



చాగలమర్రిలో పసుపు పంట పొలంలో ఏర్పాటు చేసిన పులిబొమ్మ

చాగలమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంట పొలాలకు అడవి పందులు, ఇతర జంతువులు, పక్షుల బెడద తీవ్రంగా ఉంది. అందుకని రైతులు వినూత్న ప్రయోగం చేశారు. చాగలమర్రిలోని కూలూరు రహదారిలో పసుపు పంట పొలంలో ఓ రైతు పులి బొమ్మను ఏర్పాటు చేశాడు. దీన్ని చూసి అడవి పందులు ఆ వైపు రావడం మానేశాయి. చిన్నవంగలి గ్రామ రహదారిలో మొక్కజొన్న పంట కాపాడుకునేందుకు రైతు వేప చెట్టుకు ఖాళీ మద్యం సీసాలను వేలాడదీశాడు. ఈ సీసాలు గాలికి కదిలి శబ్దం చేయడంతో పక్షులు, జంతువులు రావడం లేదు. ఇలాంటి చర్యల వల్ల మంచి ఫలితం వస్తోందని రైతులు పేర్కొన్నారు.



చిన్నవంగలి రహదారిలో వేప చెట్టుకు వేలాడదీసిన ఖాళీ మద్యం సీసాలు

కోర్టు భవన నిర్మాణానికి చర్యలు

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



అధికారులు, న్యాయవాదులతో న్యాయాధికారి కబర్ది

బనగానపల్లె, జులై 15 (ఆంధ్రజ్యోతి): పురాతన భవనంలో కొనసాగుతున్న బనగానపల్లె కోర్టుకు నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది పేర్కొన్నారు. మంగళవారం కోర్టు భవనాన్ని డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నారాయణరెడ్డి, న్యాయమూర్తులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ ఖాజాహుస్సేన్, శ్రీనివాసమూర్తి, పరశురామిరెడ్డి, మాధవరెడ్డి, అబ్దుల్‌ఖైర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లేడుతో మనవడి దాడి.. తాత మృతి

బనగానపల్లె, జులై 15 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో మనవడు బ్లేడుతో తాతపై దాడిచేయగా అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బనగానపల్లె పట్టణంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. బీసీ కాలనీకి చెందిన హుస్సేన్(72) కాళ్లు, చేతులు సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో కుమారుడి వద్ద ఉంటున్నాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న మనవడు మంచంలో ఉన్న తాత హుస్సేన్‌పై బ్లేడుతో విచక్షణా రహితంగా దాడిచేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె సుకూన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహం చేసిన నలుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూలై 15(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాలు.. రాయచూరు జిల్లా ఆశాపూర్ గ్రామానికి చెందిన ఓ బాలిక (15)కు మంత్రాలయంలో గతఏడాది ఆగస్టు 28న బాల్య వివాహం జరిపించారు. దీంతో రాయచూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2025 జూన్ 12న సీడీపీవో మహిళా సూపర్‌వైజర్ తాహెరా సుల్తాన్ ఫిర్యాదుచేశారు. ఈమేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కర్నూల్ ఎస్పీకి రాయచూరు పోలీసులు కేసును బదిలీచేశారు. వివాహం జరిగిన ప్రాంతం మంత్రాలయం కావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం బాల్య వివాహం జరిపించిన పెళ్లికూతురు, పెళ్లికొడుకు తల్లిదండ్రులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డెంగీ అనుమానిత లక్షణాలతో మహిళ మృతి

నందవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ మహిళ డెంగీ అనుమానిత లక్షణాలతో మృతి చెందారు. వివరాలివీ.. ఆనందమ్మ ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గకపోవడంతో ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు సోమవారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే చికిత్స పొందుతూ మహిళ మంగళవారం మృతి చెందారు.

ఇష్టం లేని పెళ్లి నిశ్చయించారని..

- యువతి బలవన్మరణం

పాములపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇష్టంలేని పెళ్లి నిశ్చయించారని ఉరేసుకొని ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఇస్కాల గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లయ్య, వరలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నాడు. పెద్ద కుమార్తె మానస(20)కు పెళ్లి నిశ్చయించారు. మరో నెల రోజుల్లో వివాహం చేసేందుకు తేదీని ఖరారు చేశారు. వివాహం ఇష్టం లేక పోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పాణ్యం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌ను ఐషర్ వాహన ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన శ్రీనివాసరావు, భారతి(46) దంపతులు. వీరు స్కూటర్‌పై పాణ్యం నుంచి కర్నూలుకు వెళ్తున్నారు. ఐషర్ వాహనం వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. భారతి అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనివాసరావుకు గాయాలు కాగా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భారతి పుట్టినిల్లు పాణ్యం కావడంతో నెల రోజుల క్రితం వారు ఇక్కడికి వచ్చారు. శ్రీనివాసరావు కిడ్నీ సమస్యతో వైద్య పరీక్షల నిమిత్తం కర్నూలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతురాలికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తుగ్గలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడమకుంట్ల మజరా రోళ్లపాడు తండా సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. జొన్నగిరి ఎస్ఐ మల్లిఖార్జున తెలిపిన మేరకు.. మంగళవారం సాయంత్రం రోళ్లపాడు గ్రామానికి చెందిన రామవత్ చిన్న కృష్ణనాయక్ పొలంలో మృతదేహం కనిపంచడంతో రైతులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి వైద్యశాలకు తరలించారు. మృతుడి ఒంటిపై నీం రంగు షర్టు, పంచె ధరించడాడని, సుమారు 50 సంవత్సరాలు ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు.

రూ. 37.9 లక్షలు స్వాధీనం



నగదును చూపుతున్న డోన్ అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి బెంగళూరుకు ఇంటర్‌సిటీ ప్రైవేట బస్సులో నంద్యాలకు చెందిన షేక్ అన్వర్ నుంచి రూ. 37.9 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా డోన్ అర్బన్ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. మంగళవారం డోన్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఎన్‌హెచ్-44 జాతీయ రహదారి మ్యాక్స్-4 హోటల్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా నంద్యాలకు చెందిన షేక్ అన్వర్ బ్యాగులో ఎటువంటి పత్రాలు లేని నగదును గుర్తించినట్లు తెలిపారు. వ్యాపార నిర్వహణకు సంబంధించిన డబ్బు అని ఆ వ్యక్తి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు లేదా ఆధారాలు చూపితే నగదు ఆ వ్యక్తికి అందజేస్తామని, లేకపోతే ఆదాయ పన్ను అధికారులకు అప్పజెప్పుతామని పోలీసులు చెప్పారు. సీఐ రాకేశ్, అర్బన్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ మమత ఉన్నారు.

గంగ పారని కాల్వలు

- కూలిపోయిన టీజీ ప్రధాన కాల్వ సైడ్ వాల్
- తుప్పుబట్టిన బ్లాక్ చానెల్ తూము షట్టర్లు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- 26, 27 బ్లాక్ చానెళ్ల పనులు ప్రారంభం కాని వైనం



తెలుగుగంగ ప్రధాన కాల్వలో రాళ్లు, మట్టి కుప్పలు

1,14,500 ఎకరాల్లో ఆయకట్టు

నంద్యాల జిల్లాలో తెలుగుగంగ ప్రధాన కాల్వ కింద ఆయకట్టు 1,14,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ జిల్లాలో 96.14 కిమీ పొడవు ఉంది. మొత్తం 39 బ్లాక్ చానెళ్లు ఉన్నాయి. వీటిలో 1, 1ఆర్, 15ఎ, 15బి కాల్వలతో 39 బ్లాక్ చానెళ్లు ఉన్నాయి.

రుద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు నంద్యాల జిల్లా రైతాంగానికి వర ప్రసాదిని. 1980లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, ఏపీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, తమిళనాడు ముఖ్యమంత్రి మారుతూరు గోపాలన్‌రామచంద్రన్ తెలుగుగంగను ప్రారంభించారు. చెన్నై నగరానికి తాగునీరు, రాయలసీమ ప్రాంతానికి సాగునీరు శ్రీశైలం జలాశయం నుండి శ్రీశైలం బ్యాక్ వాటర్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ద్వారా అందించడమే లక్ష్యం. కానీ ఈ కాలువలో ప్రస్తుతం నీరు పారడం లేదు. దీంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. తెలుగుగంగ ప్రధాన కాల్వ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి సుమారు 406 కి.మీ. నిర్మాణం చేపట్టి చెన్నై కాల్వలకు అనుసంధానం చేశారు. నంద్యాల జిల్లాలో 96.14 కి.మీ. పొడవునా గంగ ప్రధాన కాల్వ విస్తరించి ఉంది. కానీ దీని ప్రధాన కాల్వతో పాటు బ్లాక్ చానెళ్ల నిర్వహణ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది.

తుప్పుబట్టిన గంగ బ్లాక్ చానెల్ తూము షట్టర్లు..

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి ఉప కాల్వలకు నీరు విడిచేందుకు బ్లాక్ చానళ్ల తూములు ఏర్పాటు చేశారు. బ్లాక్ చానెళ్ల తూముల గేట్లు తుప్పుబట్టిపోయాయి. నిర్వహణ కరువవడంతో ఈ గేట్లు సక్రమంగా పనిచేయలేదు. ఇలాగైతే నీటి సరఫరా ఎలా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయం దగ్గరలోనే ఉంది.

చివరి ఆయకట్టు భూములకు అందని సాగునీరు..

తెలుగుగంగ ప్రధాన కాల్వలో భాగంగా బ్లాక్ చానెళ్ల నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరందడంలేదని ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు రుద్రవరం మండలంలో చిలకలూరు, బి. నాగిరెడ్డిపల్లె, మందలూరు, చందలూరు, జంబులదిన్నె గ్రామాల రైతులకు సాగునీరు అందకపోవడంతో ఈసారి పంటలు ఎండిపోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో సాగునీరందక పంటలు ఎండిపోయాయి. అలాగే 26, 27 బ్లాక్ చానెళ్ల పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. 2005లోనే పనులు ఆపివేశారు. ఇంత వరకు ఆ బ్లాక్ చానెళ్ల పనులు ప్రజాప్రతినిధులకు అధికారులకు పట్టలేదు.

కూలిన గంగ ప్రధాన కాల్వ గట్టు సైడ్‌వాల్

గంగ ప్రధాన కాల్వలో భాగమైన బ్లాక్ చానెల్ సమీపంలో సైడ్‌వాల్ కూలిపోయింది. బసాపురం సమీపంలో సైడ్‌వాల్స్ దెబ్బతిన్నాయి. శ్రీరంగాపురం సమీపంలోని గేట్ల వద్ద ప్రధాన కాల్వలో చెత్త చెదారం నిండిపోయింది.

బ్లాక్ చానెళ్ల గట్టు బలహీనం

గంగ బ్లాక్‌చానళ్ల గట్టు బలహీనంగా మారాయి. గండ్లు పడితే రైతులే పూడ్చుకోవలసిన పరిస్థితి. కాల్వ గట్ల వెంట వెళ్లేందుకు కూడా కంపచెట్లు పెరిగిపోయాయి. ఎక్కడ పడితే అక్కడ కోతకు గురై బలహీనంగా మారాయి. నీరు పూర్తి స్థాయిలో వదిలేందుకే లేదు. కారణం.. కాల్వగట్లు బలహీనంగా ఉన్నా యని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదని రైతుల ఆవేదన. అధికారులకు ప్రజాప్రతినిదులకు ఎన్నిసార్లు విన్నవిం చినా పెడచెవిన పెడుతున్నారు తప్ప బ్లాక్ చానెళ్ల గట్లకు మరమ్మతులు చేయడం లేదు. శాశ్వతంగా చేయడంలేదని రైతుల వాదన.

శిథిలమైన బ్లాక్ చానెళ్లు

బ్లాక్ చానెళ్లలో సిమెంటు పనులు శిథిలమయ్యాయి. సిమెంటుతో నిర్మించిన తూముల రంధ్రాలు, సైడ్ గోడలు దెబ్బతిన్నాయి. వాటిని అధికారులు పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇలాగైతే గంగ నీరు పారేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుల వద్ద సిమెంటుతో నిర్మించిన దిమ్మెలు పగిలి శిథిలమై కాల్వల్లో పడిపోయాయి.

గంగమ్మ చెరువుకు నీరు చేరడంలేదు



తెలుగుగంగ 19వ బ్లాక్ చానెళ్ల నుంచి గంగమ్మ చెరువుకు నీరు చేరడంలేదు. అప్పనపల్లె సమీపంలో ఉపకాల్వకు తరచూ గండ్లు పడుతున్నాయి. గండ్లు పడకుండా కాల్వకు శాశ్వతమైన మరమ్మతులు చేయాలి. గంగమ్మ చెరువుకు నీరందించి రైతులను ఆదుకోవాలి.

సింగతల మహేంద్రరెడ్డి, రైతు, కొండమాయపల్లె


రైతులకు సాగునీరందించేందుకు కాలవలు సిద్ధం చేయాలి



రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు భూములకు సాగునీరందించేందకు కాల్వలకు మరమ్మతు చేయించాలి. కాల్వగట్లు బలహీనంగా ఉన్నాయి. కాల్వల్లో ఉన్న సిమెంటు పనులు దెబ్బతిని నీరు పారడం లేదు. వీటికి మరమ్మతు చేయించి చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సీజనులో చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదు. - కల్లె మహేశ్వర్‌రెడ్డి



రుద్రవరం సమీపంలో కోతకు గురైన 20వ బ్లాక్ చానెల్



తుప్పుబట్టిన 21వ బ్లాక్ చానెల్ షట్టర్

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగేనా?

- అధికార పార్టీ కార్పొరేటర్లు బరిలో ఉంటారా?



కర్నూలు న్యూసిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక జరిగేనా అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే నెలలో 18న నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఇప్పటి వరకు ఎన్నికపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. గత సంవత్సరం జూలై 18 నుంచి 24 వరకు నామినేషన్లను స్వీకరణ, సాయంత్రం స్వీకరించిన వారి పేర్లను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయడం, 25న పరిశీలన, 28న విత్‌డ్రా అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

అనివార్య కారణాల వల్ల ఆగస్టు 1న ఎన్నికలు జరిగాయి. గత సంవత్సరం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 9 మంది కార్పొరేటర్లు చేరారు. దీంతో ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని నలుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వైసీపీ నుంచి ఐదుగురు నామినేషన్ వేశారు. మొత్తానికి గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఒక్క సభ్యున్ని కూడ గెలిపించుకోలేక పోయారు. మొత్తం వైసీపీ సభ్యులకే ఎన్నికయ్యారు. ప్రస్తుతం అదే జరిగే ఏమిటనే సందిగ్ధంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నగర పరిధిలో కూటమి కార్పొరేటర్లు ఓటమి చెందితే ఎలా అని కొందరు ప్రశ్నించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే 2026లో కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే ప్రస్తుతం ఎన్నుకున్న సభ్యులకు కేవలం 8 నెలల మాత్రమే కాలపరిమితి ఉంటుంది. దీని కోసమే ఇప్పటి వరకు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎన్నికపై అధికార పార్టీ ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారమే అధికారులు స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

భార్యను హత్య చేసిన భర్త

నంద్యాల టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని అబాండతాండాకు చెందిన కవిత(30)ను భర్త శివకృష్ణ మంగళవారం దారుణంగా హత్య చేశాడు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. కవితకు శివకృష్ణతో గత 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మంగళవారం కవిత ఓ వ్యక్తితో గదిలో ఉండడం చూసిన భర్త శివకృష్ణ ఇద్దరిపై కర్రతో దాడి చేశాడు. భార్య అక్కడికక్కడే మృతిచెందింది. బాలాంజినేయులు అనే వ్యక్తి తప్పించుకుని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సరెండర్ అయ్యాడు. అనంతరం శివకృష్ణ తాలుకా పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. శివకృష్ణ, కవిత దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ సర్జరీకి పెరిగిన ఆదరణ

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ
- ఘనంగా వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డే



సుశ్రుతుడి విగ్రహానికి పులమాలలు వేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ సర్జరీ వైద్యానికి ఆదరణ పెరిగిందని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ అన్నారు. మంగళవారం వరల్డ్ ప్లాస్టిక్ సర్జరీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ మంజులా బాయి ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని సుశ్రుతుని విగ్రహానికి పూలమాలలు వేశారు. కాలిన రోగుల విభాగంలో ఏర్పాటుచేసిన సదస్సులో కేఎంసీ ప్రిన్సిపాల్ మాట్లా డుతూ శరీరంలోని లోపాలను వైకల్యాలను సరిచేయడానికి, పుట్టుకతో వచ్చిన లోపాలు, గాయాలు, కాలిన గయాలను సరి చేయడానికి అధునిక యుగంలో ప్లాస్టిక్ సర్జరీ ఎంతో కీలంగా మారిందన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై 15న ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వరల్డ్ ప్లాస్టిక్ డేను నిర్వహిస్తూ వైద్యులు చేస్తున్న కృషిని గుర్తు చేసుకోవాలన్నారు. ప్లాస్టక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ మంజులా బాయ్ మాట్లాడుతూ తల వెంట్రుకల నుంచి అరికాళ్ల వరకు ప్లాస్టిక్ సర్జరీ విభాగం అనేక మంది రోగులకు సేవలు అందించిందన్నారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ సీనియర్ ప్లాస్టిక్ డాక్టర్ భానుమూర్తి కర్నూలు మెడికల్ కాలేజీ లైబ్రరీ పుస్తకాల కోసం రూ. 25వేలను విరాళంగా అందించారు. కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సాయి సుదీర్, డాక్టర్ హరిచరణ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రకాష్, ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ రాజా రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విజయ్, చంద్రమౌళి, సింధూ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పని వేళలు పాటించాలి

- ఆర్‌యూ ఉద్యోగులకు సర్క్యులర్ జారీ చేసిన వీసీ
- తాజాగా ఏడుగురికి మెమో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): "ఇష్టారాజ్యం" అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 11న ప్రచురింతమైన కథనానికి ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు స్పందించారు. విశ్వవిద్యాలయం ఉద్యోగులు పని వేళలు పాటించాలని సర్క్యుల్ జారీ చేశారు. ప్రతి ఉద్యోగి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం దాకా విధుల్లో ఉండాల్సిందేనని, ఇకపై హెచ్‌వోడీలు పర్యవేక్షణ చేపడతారని అందులో పేర్కొన్నారు. తాజాగా సోమవారం ఓ నాన్ టీచింగ్ ఉద్యోగి ఆస్పత్రిలో ఆంజియోగ్రామ్ చేయించుకుంటూ మరో వైపు విధుల్లో కొనసాగినట్లు సంతకాలు చేసిన హాజరు పట్టికతో కూడిన రిజిస్ట్రార్ సంతకాల కాపీలు వాట్సాప్ గ్రూప్‌ల్లో చక్కర్లు కొట్టాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉపకులపతి ఏడుగురు ఉద్యోగులకు మెమో జారీ చేసినట్లు వర్శిటీ పాలనా విభాగం అధికార్లు తెలిపారు.

వైసీపీవి పగటి కలలే

● వీబీఆర్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసిన ఎమ్మెల్యేలు బుడ్డా, అఖిలప్రియ


వెలుగోడు తెలుగుగంగ జలాశయ గేట్లను ఎత్తుతున్న ఎమ్మెల్యేలు

వెలుగోడు , 15 జూలై (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటుందని శ్రీశైలం, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం వారు తెలుగుగంగ జలాశయం మెయిన్ కెనాల్ మూడు గేట్లను ఎత్తి 3000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అంతకముందు వారు గెట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాశయం వద్ద గంగమ్మకు చీర, సారెను సమర్పించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసీపీ జలాశయాలను, రైతులను పట్టించుకోలేదన్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల కోసం, రైతుల కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. వెలుగోడు జలాశయం, సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ కోసం రూ.5కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 20 రోజుల ముందే నీరు జలాశయానికి చేరుకుందని అన్నారు. ఈ ఏడాది సైతం జలాశయంలో పూర్తి స్థాయిలో నీటి నిల్వను ఉంచుతామన్నారు. కార్యక్రమంలో తెలుగుగంగ సీఈ ప్రతాప్, ఈ ఈలు శివశంకర్‌రెడ్డి, జవహర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, ఎల్లాల కృష్ణుడు, మోమిన్ రసూల్, సుధాకర్ రెడ్డి, వీరభద్రుడు, రామానాయుడు,ఖలీల్,జాకీర్ హుసేన్, రైతులు పాల్గొన్నారు.

రేపు మల్యాలకు సీఎం చంద్రబాబు


మల్యాల ఎత్తిపోతల ట్రయల్ రన్

నందికొట్కూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం మల్యాలకు రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లుకు చేరుకుంటారు. అక్కడి నుంచి మల్యాలకు చేరుకొని కృష్ణమ్మకు జలహారతి ఇస్తారు. అనంతరం హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోసే పంపుల స్విచ్చాన్ చేసి సీమకు నీటికి ఎత్తిపోస్తారు. అల్లూరు వద్ద హెలిప్యాడ్, సభ నిర్వహించే ప్రదేశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నందికొట్కూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసుందుకు కూడా పరిశీలిస్తున్నారు. హెలిప్యాడ్, రైతులతో ముఖాముఖి సభలు ఏర్పాటుపై కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ సీనియర్ నేత మాండ్ర శివానందరెడ్డిలతో కలసి సమీక్షించారు.

రెండు పంపులు ద్వారా: ముందుగా రెండు పంపుల ద్వారా 700 క్యూసెక్కుల ఎత్తిపోస్తారు. విస్తరణ పనులు దృష్ట్యా క్రమక్రమంగా ఒక్కో పంపు పెంచుతూ పోతారు. 12 పంపులు ద్వారా రోజుకు 3,850 క్యూసెక్కులు తీసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది 40 టీఎంసీలు ఎత్తిపోసి కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో సాగు, తాగునీరు అందించేలా సన్నహాలు చేస్తున్నారు. మిడ్తూరు మండలం కలమందలపాడు- దిగువపాడు మధ్యలో 0.264 టీఎంసీలు ఎత్తిపోసేసి 4,200 ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రతిపాదించారు. రూ.54 కోట్లు నిధులు కావాలని, 0.264 టీఎంసీలు వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఉంది. కలమందలపాడు, పారుమంచాల, జలకనూరు గ్రామాల రైతులకు జల ప్రయోజనం కలుగుతుంది.

రంగు మారిన నీరు ఎలా తాగాలి?

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పై సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ మల్లీశ్వరి

పగిడ్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రాతకోట గ్రామంలో ముస్లిం కాలనీకి రంగు మారిన(బురదనీరు) నీరు సరఫరా అవుతున్నదని, ఆ నీటిని ఎలా తాగాలని మండల కో-ఆప్షన్ సభ్యుడు అస్లాం బాషా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌ను నిలదీశారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మండ్ల మల్లీశ్వరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రాతకోట గ్రామంలో కేసీ కెనాల్ సమీపంలో కొత్తగా వేసిన బోరు నుంచి పచ్చగా రంగుమారిన నీరు సరఫరా అవుతుందని, ఆ నీటిని ఉపయోగించేందుకు ఇబ్బందిగా మారిందని సభ్యులు సంబంధితా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమారును ప్రశ్నించారు. దీంతో ఆయన నీరు పచ్చగా వచ్చినంత మాత్రన ఎలాంటి ప్రమాదాలు జరగవని, ఆ నీటినే వినియోగించుకోవాలని సమాధానం ఇచ్చారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎక్కడ కూడా ట్యాంక్‌లను శుభ్రం చేయడం లేదని, పారిశుద్యం పనులు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని మండల ఉపాధ్యక్షురాలు అరుణమ్మ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు వేయించుకొని సరుకులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సభ్యులు తహసీల్దార్ శివరాముడి దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం లేదని జడ్పీటీసీ సభ్యురాలు దివ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగవల్లిని నిలదీశారు సమావేశంలో ఎంపీడీవో సుమిత్రమ్మ, ఎంఈవో సుబాన్, వ్యవసాయాధికారి మురళీధర్, ఏపీవో మద్దిలేటి, పీఆర్ ఎఈ జావిద్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తిమ్మయ్య, రాజులు మాట్లాడుతూ.. గతంలో సమ్మెచేసిన సందర్భంగా ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలుపర్చలేదని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జయన్న, నబీఖాన్, రాజు, రాజేష్, సువర్ణమ్మ, సుశీలమ్మ, సుగుణమ్మ ఉన్నారు.

నందికొట్కూరు: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మోకాళ్లపై నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్,సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, ఇంజనీరింగ్ శాఖలో పని చేస్తున్న శ్రీరాములు, శ్రీనివాసులు, వెంకటరమణ, బక్కన్న, ఎలక్ట్రికల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటరు జాబితాకు సహకరించండి


మాట్లాడుతున్న ఈఆర్వో ప్రేమంత్‌కుమార్

ఆత్మకూరు, జూలై (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక తదితరులు ఉన్నారు.

ఇంటింటి ఓటరు సర్వేపై బీఎల్‌వోలకు శిక్షణ

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇంటింటి ఓటరు సర్వేపై మంగళవారం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. శ్రీశైలం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రేమంతకుమార్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ద్వారా బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను విచారించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఓటరు నుంచి డిక్లరేషన్ పొందాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన బీఎల్‌ఓలకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


80బన్నూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధేమయమని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని 80బన్నూరు గ్రామంలో ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాదిలోపు ఆచరణలో చూపించారని అన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ మండల నాయకులు మోహన్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి అశోక్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రవికాంత్, రవికుమార్‌యాదవ్, పెద్దన్న, దేవసహాయం, శేఖర్, నాగరత్నం పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి కృషి

పాములపాడు: మండలంలోని కోల్స్ ఆనందాపురం బ్రిడ్జిని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూటూరు నుండి కోల్స్ ఆనందాపురం, సిద్దేశ్వరం, తరిగోపుల, రామసముద్రం తదితర గ్రామాలకు వెళ్లే గ్రామస్తులు శిథిలావస్థకు చేరింది. నూతన బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూసలకృష్ణ మధు, గోవిందు, వెంకటేశ్వర్లు యాదవ్, జనార్దన్, సన్ని, రామస్వామి, పలుచాని మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


వెలుగోడులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వెలుగోడు పట్టణంలోని కొమ్ముపాలెం, రాజా నగర్ కాలనీలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, కృష్ణుడు, రసూల్, ఖలీల్, వీరభద్రుడు, వెంకటరమణ, సయ్యద్, జాకీర్ హుసేన్, పుల్లంరాజ్, చంద్ర పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

పాములపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు మండల వ్యవసాయశాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించి పంటసాగులో మెలకువలు పాలించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేస్తున్న మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలలో వేయాల్సిన ఎరువులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు.

ఉచిత యోగా శిక్షణ

నంద్యాల కల్చరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మంగళవారం భక్తులు, స్థానికుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలోని చంద్రావతి కళ్యాణమండపంలో నిర్వహిస్తున్న ఈ యోగా శిక్షణను ప్రముఖ యోగాగురువు యోగాచార్య ఒంగోలు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం బృందంచే శిక్షణను ఇస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో యోగ ప్రాశస్త్యాన్ని, సూక్ష్మవ్యాయామ పద్ధతులను నేర్పించారు. అనంతరం మండూకాసనం, శశాంకాసనం, అర్ధఉపాసనం, పూర్ణఉపస్థానం, త్రికోణాసనం, పాదుహస్తాసనం, వజ్రాసనాలను యోగాచార్యులు సాధకులతో వేయించడం జరిగింది.

రెఫరీ బోర్డు సభ్యుడిగా చంద్రారెడ్డి

పాణ్యం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డిని రెఫరీ బోర్డు సభ్యుడిగా ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 13 వతేదీన తిరుపతిలో జరిగిన ఏపీ బాల్‌బ్యాడ్మింటన్ జనరల్ బాడీ సమావేశంలో ఏపీ రాష్ట్రజనరల్ సెక్రటరీ, అధ్యక్షులు, వివిధ జిల్లాల అధికారుల సమక్షంలో రెఫరీ బోర్డు మెంబరుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. చంద్రారెడ్డిని కళాశాల ఎండీ శివరాం, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది బృందం అభినందించారు.

పెండింగ్ బకాయిలు, డీఆర్ చెల్లించాలి

నంద్యాల రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, కార్యదర్శి ప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 17న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జయప్రకాష్, బాలనాగిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం చలో ఢిల్లీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. నంద్యాల డీవైఎఫ్ఐ కార్యాలయంలో కార్యదర్శి శివ ఆధ్వర్యంలో పోస్టర్‌లను విడుదల చేశారు. శివ మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను నేటికి అమలు పరుచలేదన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమంటున్నారని, 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పరుచుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని విభజన హామీల సాధన కూడా ఉందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సహాయ కార్యదర్శి సాయి, అంజి, రమణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై సంతకాల సేకరణ

నంద్యాల హాస్పిటల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంద్యాలలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.ఆర్. వెంకటరమణ పొగాకుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకువల్ల ఆరోగ్య సమస్యల గురించి విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో 7నుంచి 9తరగతుల విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టామన్నారు. మండలాల్లో సంతకాలు ఎక్కువగా సేకరించిన విద్యార్థులకు మల్టీపర్పస్ బ్యాగ్‌ను బహుమతిగా ఇస్తామన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి ముగ్గురిని ఎంపికచేసి వారికి ప్రశంసాపత్రాలు, మల్టీపర్పస్‌బ్యాగ్ అందజేస్తామన్నారు. సంతకాల సేకరణ 21వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.కాంతారావు నాయక్, జాతీ య పొగాకు నియంత్రణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నవీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వేతన సర్వీసు కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు సంబంధించిన 12వ వేతన సర్వీసు కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్, ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, సహా అధ్యక్షులు ఎం.ఎస్ ఉమర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరులో వారు మాట్లాడుతూ.. వేతన సవరణకు సంబంధించిన కమిషన్‌ను నియమించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. అలాగే 2024 నుంచి చెల్లించాల్సిన నాలుగు విడతల కరువు భత్రం కూడా మంజూరు చేయాలని అన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు అబ్దుల్ వహీద్, శ్రీనివాసులు, రామాంజనేయులు, విధుభూషణ్, రాజ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, వెంకటాద్రి, సూర్యనారాయణ ఉన్నారు.

సీఎంను కలిసిన ప్రముఖ పారిశ్రామికవేత్త


సీఎం చంద్రబాబునాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బొగ్గరపు నాగరాజు మంగళవారం ఢిల్లీలోని విమానాశ్రయంలో సీఎం నారా చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

విచ్చలవిడిగా బయో మందుల అమ్మకాలు

నందికొట్కూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలు యథేచ్ఛగా బయోమందులు, ఎరువులు, నకిలీ విత్తనాలను అమ్ముతున్నారంటూ సీపీఐ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జి ల్లా కార్యవర్గ సభ్యులు రఘురాంమూర్తి మాట్లాడుతూ పట్టణంలో కొన్ని అనుమతులు లేని దుకాణాలు ఉన్నాయని, వాటిలో బయో మందుల అమ్మకాలు జరుగుతున్నాయని, వీటి వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. కావున ఇలాంటి దకాణాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీకి వారు ఫిర్యాదు చేశామన్నారు.

విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ స్క్వాడ్ అధికారులు

పాణ్యం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం చేపట్టిన ఎరువులు, పురుగుమందుల దుకాణాల తనిఖీలో రూ. 5.76 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు తెలిపారు. స్థానిక వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల స్టాకు రిజిస్టర్, అనుమతి పత్రాలు, నిల్వలను తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో రూ. 5. 76 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తనిఖీ బృందం అధికారులు, ఏడీఏ నరసింహారెడ్డి, ఎంఏఓ జయప్రకాష్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని విజిలెన్స్ ఏడీఏ ప్రసాద్, ఏడీఏ గిరీష్, ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ శ్రీనివాసులు అన్నారు. మిడుతూరు గ్రామంలోని బిస్మిల్లా కిసాన్, అగ్రి మాల్ షాపులను వారు మంగళవారం తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. వీరి వెంట వ్యవసాయ అధికారి పీరునాయక్ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఎరువుల వ్యాపారస్థులు అక్రమ అమ్మకాలు, నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర స్థాయి తనికీ స్క్వాడ్ ఏడీ నరసింహారెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం బండిఆత్మకూరులోని పలు ఎరువుల దుకాణాల్లో ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 72 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశామన్నారు. వెంట అనంతపురం విజిలెన్సు ఎస్ఐ గోపాలుడు, నంద్యాల ఎవో ప్రసాదరావు ఉన్నారు.

నందికొట్కూరు: సరైన రికార్డులు లేకపోవడంతో పట్టణంలోని దుఖాణాల్లో 20 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏ.ఎం.ఈ ప్రసాదర్ తెలిపారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. పట్టణంలోని ఓ దుకాణంలో 20 మెట్రిక్ టన్నుల 10-26-26 కాంప్లెక్స్ ఎరువులకు సరైన రికార్డులు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సి.ఐ శ్రీనివాసులు, నందికొట్కూరు ఏడీఏ గిరీష్, ఏవో షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం రాష్ట్రస్థాయి తనిఖీ బృందం ఆకస్మాత్తుగా తనిఖీలు చేపట్టింది. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు దుకాణాల్లోని రికార్డులను, స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాడీ బిల్డర్లను ప్రభుత్వం ప్రోత్సహించాలి



బాడీ బిల్డర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల హాస్పిటల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఆంధ్రాలో నంద్యాల జిల్లాకు చెందిన హుసేన్‌బాసా 3వ స్థానం సాధించిన సందర్భంగా మంగళవారం నంద్యాల డీవైఎఫ్ఐ కార్యాలయంలో హుసేన్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఐకాన్ జిమ్ మాస్టర్ ఖాజావలిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, సహాయ కార్యదర్శి సాయి, అంజి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కళ్లలో ఆనందం


విత్తనాలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మధు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్‌లో 20 రోజులకు ముం దే ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుం టే రైతుల కళ్లలో ఆనందం కనపడుతోందని నం ద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు అన్నారు. నంద్యాల పట్టణంలోని నేషనల్ సీడ్ కార్పొరేషన్ మధు సందర్శించి విత్తనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని, యూరియా కొరత లేకుండా చేశారని కొనియాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తాం

నంద్యాల హాస్పిటల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్. వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశావర్కర్లకు ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినతిపత్రాలు స్వీకరించి జిల్లాలో పనిచేస్తున్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషిచేస్తామన్నారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగానికి ప్రాధాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నేటి కాలంలో నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగానికి ప్రాధాన్యతనిస్తారని నంద్యాల జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, శ్రీ రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ యూత్ స్కిల్‌డే సందర్భంగా రామకృష్ణా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవచ్చని అన్నారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రగతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని అన్నారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లలితాసరస్వతి, విజయ్‌కాంత్, హిమబిందు, మురళీధర్, మహేశ్, శేఖర్ పాల్గొన్నారు.

మిడుతూరు: యువత నైపుణ్యత సాధించడంలో ముందు ఉండాలని మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. జూలై 15ను ప్రపంచ నైపుణ్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మాడల్ స్కూల్‌లో నైపుణ్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దివ్యాంగుల పరికరాల గుర్తింపు నమోదు పూర్తి

పాణ్యం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల సహాయ పరికరాల గుర్తింపు కార్యక్రమం మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ముగిసింది. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలింకో సంస్థ పర్యవేక్షణలో పరికరాల కోసం నమోదు చేసుకున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రెయిస్ ఫాతిమా తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో 450 మంది, నందికొట్కూరులో 350, ఆత్మకూరులో 300, ఆళ్లగడ్డ 320, డోన్ 210, బనగానపల్లె 300, పాణ్యం మండలంలో 400ల మంది దివ్యాంగులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పరికరాలు నెలలోపు దివ్యాంగులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహశీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, అలింకో సంస్థ నిర్వాహకులు బిక్రం మహారాణా పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవాన్ని తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి తెలుగు అధ్యాపకుడు ఎ.క్రిష్ణశశాంక అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, డిజిటల్ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. నైపుణ్య విద్య ప్రస్తుత సమాజంలో ఎంత అవసరమో వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ భాస్కరరెడ్డి, జంతు, భౌతిక, రసాయన శాస్త్రాల అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, క్రిష్ణదాసు, పి.అన్నపూర్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

చాగలమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న వివిధ నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలను బాలికలు వినియోగించుకోవాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. మంగళవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివలక్ష్మి, నైపుణ్య శిక్షణ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే చాగలమర్రి ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల గ్రేడింగ్ పరిశీలించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

ఆళ్లగడ్డ, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని గౌరీదేవి అమ్మవారికి కూరగాయలతో అలంకరించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మహిళా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
- ఆళ్లగడ్డలో 'తొలి అడుగు'

ఆళ్లగడ్డ, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బుడగ జంగాల కాలనీలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చాలా మంది క్యాంపు కోసం అడుగు తున్నారని, కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేయిస్తామన్నారు. వైసీపీ నాయకుల కొత్త డ్రామాకు తెర తీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం చిత్తశుద్ధితో పని చేస్తోందని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు ఇస్తామన్నారు. రాయలసీమ రైతుల కోసం శ్రీశైలం, వెలుగోడు ప్రాజెక్టుల గేట్లు ఎత్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ హుసేన్‌బాష, నీటి సంఘం అధ్యక్షురాలు సెజ్జారెడ్డి, టిడిపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ పెద్దలు నాగంజీ, రమణబాబు, శ్రావణ్‌కుమార్, రమీజాబి, సచివాలయ అధికారు లు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఆర్‌కొత్తపల్లి, ఆర్‌బుక్కాపురం, అంబాపురం గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కరపత్రాలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అన్నీ పరిష్కరిస్తామ న్నారు. అంతకుముందు గ్రామంలో టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగం పలికారు. కార్యక్రమంలో ఆర్‌కొత్తపల్లి మునీశ్వర్‌రెడ్డి, సర్పంచు నాగరాజు, లక్ష్మన్న, అంబాపురం సర్పంచు శ్రీనివాసయాదవ్, మండలకన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకులు బుగ్గన ప్రసూన లక్ష్మీ, రాఘవరెడ్డి, బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవీంద్ర నాయక్, మేకల నాగరాజు, సుధాకర్, రాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల





నేడు సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

బేతంచెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల సహకార సొసైటీ చైర్మన్‌గా నియమితులైన ఉన్నం చంద్రశేఖర్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను టీడీపీకి అందించిన సేవలను గుర్తించి అధిష్ఠానం బేతంచెర్ల సహకార సంఘం చైర్మన్‌గా నియమించిందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవచేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు.


చంద్రశేఖర్

ఈవో సస్పెన్షన్

రుద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఈవో సుబ్బారావు సస్పెండ్ అయినట్లు మంగళవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు పేర్కొన్నారు. రుద్రవరం మేజరు పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దాంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులు స్కిల్స్‌పై దృష్టి సారించాలి

అవుకు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు స్కిల్స్‌పై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హేమీమా అన్నారు. మంగళవారం వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో వృత్తివిద్య ఉపాధ్యాయులు సురేంద్ర, హుశేన్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్ద పీట

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు

డోన్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్ ప్రయో జనాలకే పెద్దపీట వేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా మహాసభలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో పార్టీ మహాసభలు నిర్వహించనున్న తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రాధాకృష్ణ, పులిశేఖర్, రాముడు, నారాయణ పాల్గొన్నారు.







పంటలకు బీమా తప్పనిసరి

దొర్నిపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. మంగళవారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం

సంజామల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ఉత్పత్తులు ఆరోగ్యదాయకమని ప్రకృతి వ్యవసాయ డీపీఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సంజామలలో ప్రస్తుత వ్యవసాయం పంటలను ఏడీపీఎం సలాంతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బయో రీసర్చ్ సభ్యులు శివరామయ్య, ఎన్‌ఎస్‌ఏ రామకృష్ణ, ట్రైనర్ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

సోయాబీన్ సాగు లాభదాయకం

రుద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సోయాబీన్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఏవో సుమతి అన్నారు. మంగళవారం మండలంలోని మందలూరు, నక్కలదిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సోయాబీన్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

శిరివెళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు సూచించారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగిల్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను సీఐ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ దస్తగిరిబాబు

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

శిరివెళ్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిని గుర్తించి చికిత్స అందించకపోతే ప్రాణాంతకంగా మారు తుందని, అప్రమత్తంగా ఉండాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శిరివెళ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు టీబీ స్ర్కీనింగ్ పరీ క్షలను మంగళవారం నిర్వహించారు. క్షయ వ్యాధిపట్ల అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, టీబీ సూపర్‌వైజర్ శివ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


శిరివెళ్లలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని సన డిగ్రీకాలేజీలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానితులపై సమాచారం ఇవ్వాలి

కోవెలకుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కొత్తవారు సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో దొంగతనాలు అధికమయ్యావని, వీటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

స్వచ్ఛ దివస్ అందరి బాధ్యత

చాగలమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదివస్ అందరి బాధ్యతని డిప్యూటీ ఎంపీడీవో తాహిర్ హుసేన్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దబోధనంలో హరితరాయబారులు చేస్తున్న పారిశుధ్య పనులను, డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. గ్రామాల్లో చెత్తాచెదారం తరలించేందుకు రిక్షాలను పంపిణీ చేశామన్నారు. ఆయన వెంట కార్యదర్శి రాజేష్ ఉన్నారు.

నేటి నుంచి పీ-4 గ్రామ సభలు

చాగలమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 17 సచివాలయాల్లో బుధవారం నుంచి పీ-4 గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. 16న చాగలమర్రి, 17న చింతలచెరువు, 18న చిన్నవంగలి, గొడిగనూరు, 19న డి.వనిపెంట, పెద్దబోధనం, 21న మద్దూరు, 22న మల్లేవేముల, నేలంపాడు, 23న ముత్యాలపాడు, 24న పెద్దవంగలి, 25 శెట్టివీడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభలకు ప్రత్యేక అధికారులను ని యమించామన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ ఉన్నారు.

రైతుల హక్కు పత్రాల పరిశీలన

చాగలమర్రి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేములలో హైవే రహదారి కోసం భూములు కోల్పోయిన రైతుల హక్కు పత్రాలను మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆరు ఎకరాలకు సంబంధించిన పొలం హక్కు పత్రాలను పరిశీలించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. పాసు పుస్తకాలు, అభ్యంతర పత్రాలను పరిశీలించామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

బెండలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏవో

ఉయ్యాలవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): బెండ పంట సాగు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పంటలో తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు వ్యవసాయాధికారుల సూచనలతో మందులు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సునీత, వీఏఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మొక్కజొన్న సంరక్షణకు చర్యలు తీసుకోండి

కొలిమిగుండ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు విస్తారంగా సాగుచేసిన మొక్కజొన్న పంట సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం పెద్దవెంతుర్ల గ్రామంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, ధరణి, దేవేంద్ర పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు సువర్ణదేవి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల లిస్టులో మార్పులు, చేర్పులపై ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. ఫామ్‌లపై అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో డీటీ ప్రసాదు బాబు, ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బూత్‌లెవల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. బనగానపల్లె ఎలక్షన్ అధికారి మంజుల అవగాహన కల్పించారు. వీఆర్వోలు, బూత్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

బేతంచెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, మధుశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అర్ధనగ్నంగా ఇంజనీరింగ్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య, రామాంజనేయులు, మధుశేఖర్ మాట్లాడుతూ జీవో నెం.36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు రూ.26వేలు, రూ.లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాల న్నారు. కార్యక్రమంలో జలీల్, నాగన్న, అదీల్, విజయ్, శ్రీను, రాజు, చందు, మద్దయ్య పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

సంజామల, జూలై 15(ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని ఎస్సార్‌బీసీ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ మల్కి హుసేన్ అన్నారు. మంగళవారం బనగానపల్లెలోని రవ్వలకొండ వద్ద ఉన్న పదో బ్లాక్ మెయిన్ గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో డీఈ తమ్మినాయుడు, ఇల్లూరు కొత్తపేట సాగునీటి చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ మనోహర్ రెడ్డి, మద్దిలేటి, మాధవ రైతులు పాల్గొన్నారు.